సాక్షి తిరుపతి

శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023



మద్యం దొంగల అరెస్ట్

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అక్రమాలకు పాల్పడే ముగ్గురిని ఎస్ఈబీ పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు.

- IIలో



ఉద్యోగప్రాప్తిరస్తు!

యూనివర్సిటీల్లో ఏళ్లతరబడి పేరుకుపోయిన ఖాళీ అధ్యాపక పోస్టుల భర్తీకి సమయం ఆసన్నమైంది.

- IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	23
చిత్తూరు	33	22
తిరుమల	29	18
గూడూరు	35	25
నగరి	34	23

న్యూస్‌రీల్

చెంగాళమ్మ పరమేశ్వరికి ముక్కంటి సారె



సారెను తీసుకెళుతున్న ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: దేవీ నవరాత్రుల్లో భాగంగా సూళ్లూరుపేటలో వెలసిన చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి గురువారం ముక్కంటి సారెను సమర్పించారు. ముందుగా శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అలంకార మండపంలో సారెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయానికి చేరుకోగా.. అక్కడ చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి స్వాగతం పలికారు. ముక్కంటి సారెను వేదపండితులకు అందజేశారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పాలకమండలి సభ్యులు కొండూరు సునీత, జయమ్మ, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీదేవి, ప్రముఖులు నంద, వెంకటసుబ్బయ్య, దినేష్ రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు అప్పగించండి



అధికారులకు ఆదేశాలు ఇస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: దశలవారీగా ప్రభుత్వ భవనాలను పూర్తిచేసి సంబంధిత అధికారులకు అప్పగించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. గురువారం ఉన్నతాధికారుల వీడియోకాన్ఫరెన్స్ అనంతరం ఆయన జిల్లా పంచాయతీరాజ్, ఆర్‌బ్ల్యూఎస్ ఎస్ఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణాలు వేగవంతం చేయడంతోపాటు నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 414 గ్రామ సచివాలయ భవనాలకుగాను 197, 185 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు 61, 273 రైతు భరోసా కేంద్రాలకుగాను 132 పూర్తి చేసినట్లు వెల్లడించారు. పూర్తయిన వాటిని ఈనెల 21వ తేదీలోపు సంబంధిత శాఖలకు అప్పగించాలని తెలిపారు. మిగిలిన భవనాలను నవంబర్ 5వ తేదీ, డిసెంబర్ 10వ తేదీ, 2024 జనవరి 10వ తేదీలోపు మూడు దశల్లో 100 శాతం భవనాలు అప్పగించాలని స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 68,763 మంది స్వామివారిని దర్శించుకోగా, 28,377 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.56 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆర్డీఓల బదిలీ



నిశాంత్‌రెడ్డి, తిరుపతి ఆర్డీఓ



రవిశంకర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీఓ

తిరుపతి అర్బన్: తిరుపతి ఆర్డీఓగా అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ఆర్డీఓ ఏ.నిశాంత్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు విడుదల చేశారు. తిరుపతి ఆర్డీఓగా పనిచేస్తున్న వీ.కనకనరసారెడ్డిని విజయవాడ ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శ్రీకాళహస్తి ఆర్డీఓగా పనిచేస్తున్న రామారావు వారం రోజుల క్రితం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ఈఓగా బదిలీ అవగా.. అప్పటి నుంచి తిరుపతి ఆర్డీఓకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే బదిలీ నేపథ్యంలో కడప ఆర్డీఓగా పనిచేస్తున్న రవిశంకర్‌రెడ్డిని శ్రీకాళహస్తి ఆర్డీఓగా నియమించారు.

గరుడోత్సాహం!

నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తనకు అత్యంత ఇష్టమైన గరుడ వాహనంపై ఊరేగుతూ కనువిందు చేశారు. దేవదేవుని ప్రతిరూపాన్ని తనివితీరా చూసి భక్తులు తరించారు. గోవిందా..గోవింద నామస్మరణ మిన్నంటించారు. కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎక్కడా చిన్నపాటి ఇబ్బందులు లేకుండా టీటీడీ అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఎక్కువ మంది స్వామివారిని దర్శించుకునేలా తిరుమాడ వీధుల్లో వాహనాన్ని అటూఇటూ తిప్పుతూ భక్తులను ఆకట్టుకున్నారు.



మోహినీ అవతారంలో ఊరేగుతున్న మలయప్ప





గరుడ సేవకు పోటెత్తిన భక్తులు(ఇన్‌సెట్) గరుడ వాహనంపై గోవిందుడు



- నేత్రపర్వంగా తిరుమలేశుడి గరుడ సేవ
- కొండకు పోటెత్తిన భక్తులు
- కిక్కిరిసిన గ్యాలరీలు, బారికేడ్లు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన టీటీడీ చైర్మన్, ఈఓ

తిరుమల: తిరుమలేశుడి గరుడ సేవకు భక్తులు పోటెత్తారు. ఈ సారి గరుడ వాహన సేవను నిర్ణీత సమయం సాయంత్రం 6.30 గంటలకే ప్రారంభించారు. వాహనంపై ఉన్న దేవదేవుడిని ప్రతి భక్తుడూ దర్శించుకునేలా వాహనాన్ని అటూ ఇటూ తిప్పుతూ ముందుకు కదిలించారు. భక్తులు అధికంగా నిరీక్షించే ప్రాంతాల్లో హారతులతో కూడిన దర్శనం ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి పర్యవేక్షిస్తూ సఫలీకృతులయ్యారు.

జగన్నాటక సమ్మోహనం

బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు గురువారం ఉదయం జగద్రక్షకుడైన శ్రీ వేంకటేశ్వరుడు మోహినీ రూపంలో దంతపల్లకీపై శృంగార రసాధి దేవతగా, పక్కనే వెన్న ముద్ద చేతబట్టిన చిన్ని కృష్ణుడితో కలిసి హొయలొలుకుతూ భక్తకోటిని సాక్షాత్కరించారు.

ఉదయం నుంచే కిటకిట

గురువారం ఉదయం నుంచే తిరుమలకు భక్తులు పోటెత్తారు. ఉదయం మోహినీ అవతారం ఊరేగింపులోనే నాలుగు మాడ వీధులు భక్తులతో నిండిపోయాయి. సాయంత్రం 4 గంటలకే అన్ని గ్యాలరీలు కిటకిటలాడాయి. ఆలయ వీధుల్లో 2లక్షల మంది కూర్చునే అవకాశం ఉండడంతో ఆమేరకు ఏర్పాట్లు చేపట్టారు.

భక్తులందరికీ అన్నప్రసాదాలు

గ్యాలరీల్లో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, పులిహోర, ఉప్మా, సాంబారన్నం, ఇతర అన్నప్రసాదాలు, పాలు, తేనీరు పంపిణీ చేశారు. అలిపిరి నుంచి తిరుమల వరకు అనేక సంస్థలు, వ్యక్తులు భక్తులు అన్నదానం చేశారు.

కట్టుదిట్టమైన భద్రత

తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు. 4,700 మందిని ఆలయ నాలుగు మాడ వీధులు, ట్రాఫిక్ మళ్లింపు ప్రాంతాల్లో మోహరించారు. పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌లో నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షిస్తూ నిఘాలు పటిష్టం చేశారు.



కళాభివందనం!



గరుడానందం..శ్రీవేంకటేశ మహత్యం



వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమనతో రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



సమ్మోహనం..సాంస్కృతిక నీరాజనం

చేదోడు వాదోడుగా!

- అట్టహాసంగా నాల్గో విడత జగనన్న చేదోడు
- జిల్లాలో 10,177 మందికి రూ.10.17 కోట్ల వరకు లబ్ధి

తిరుపతి అర్బన్: చేతివృత్తులకు చెందిన పేద వారికి రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన జగనన్న చేదోడు నాల్గో విడత కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి, రజక, నాయీబ్రాహ్మణ, టైలర్స్‌కు చెందిన లబ్ధిదారులు హాజరయ్యారు. కర్నూల్ జిల్లా, ఎమ్మిగనూరు నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాల్గో విడత జగనన్న చేదోడు కార్యక్రమాన్ని ప్రారంభించగా.. అదే సమయంలో కలెక్టరేట్ నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులతోపాటు లబ్ధిదారులు పాల్గొన్ని వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో 10,117 మంది లబ్ధిదారులకు రూ.10.17కోట్లు జమ చేసినట్టు వెల్లడించారు. నాలుగేళ్లలో ఒక్కొక్కరికి రూ.40 వేల వరకు అందినట్టు తెలిపారు. అర్హులై ఇంకా ఎవరైనా మిగిలిపోయి ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, వర్గ, పార్టీ వివక్షత లేకుండా అర్హుతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్నారని కొనియాడారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ ఏఈఓ బాబు రెడ్డి, బీసీ సంక్షేమశాఖ, కార్పొరేషన్ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

జగనన్నకు అండగా ఉంటాం



నేను డ్వాక్రా గ్రూపులో రుణమాఫీ పొందాను. మా పిల్లలకు వసతి దీవెన, విద్యాదీవెన వస్తోంది. జగనన్న కాలనీలో ఇంటిపట్టా పొందాను. సీఎం జగనన్న పరిపాలన బాగుంది. ఆయనకు అండగా ఉంటాం. –ప్రేమ, అవిలాల

కుట్టుమిషన్ కొనుగోలు చేశా



జగనన్న చేదోడు పథకం ద్వారా వచ్చిన మొత్తంతో కుట్టుమిషన్ కొనుగోలు చేశాను. అప్పులు చేయకుండా జీవనం సాగిస్తున్నాను. దీంతో పాటు జగనన్న కాలనీలో ఇంటిపట్టా పొందాను. ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాను. – మీనాక్షి, తిరుపతి అవిలాల

జ్యుడిషియల్ ప్రివ్యూకు టెండర్ డాక్యుమెంట్లు

తిరుమల: శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం టీటీడీ తిరుపతిలో నిర్మించతలపెట్టిన అచ్యుతం, శ్రీపథం వసతి సముదాయాల టెండర్ డాక్యుమెంట్లను జ్యుడిషియల్ ప్రివ్యూకు సమర్పించారు. ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 27వ తేదీలోపు తెలియజేయాలని కోరారు. తిరుపతిలో రెండో సత్రం స్థానంలో రూ.300 కోట్లతో అచ్యుతం, మూడో సత్రం స్థానంలో రూ.300 కోట్లతో శ్రీపథం వసతి గృహాలను నిర్మించాలని టీటీడీ నిర్ణయించింది. ఏవైనా సలహాలు, అభ్యంతరాలుంటే apjudicialpreview@fmai.com కు లేదా cettdtpt@fmai.com మెయిల్ ద్వారా తెలియజేయాలని టీటీడీ కోరింది. ఇతర వివరాల కోసం httpr://judicialpreview.ap.gov.in www.tirumala.org వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించింది.

విద్యార్థులు అన్నింటా రాణించాలి

- ఇస్రోలో పనిచేయడానికి ఎంబీయూ విద్యార్థులు సమర్థులే
- అట్టహాసంగా 'మోహనమంత్ర -2023'
- వేడుకలను ప్రారంభించిన శాస్త్రవేత్తలు, వీసీ

చంద్రగిరి: భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనే కాకుండా సంస్కృతి, క్రీడలు, వివిధ రంగాల్లోనూ రాణిస్తూ, బలమైన దేశంగా ఆవిర్భవిస్తోందని శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణన్ అన్నారు. శ్రీసాయినాథ నగర్‌లోని మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో గురువారం మోహన మంత్ర–2023 కార్యక్రమం విద్యార్థుల కేరింతల నడుమ అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా గోపీకృష్ణన్‌తోపాటు వాతావరణ పరిశోధన సంస్థ(గాదంకి) శాస్త్రవేత్త డాక్టర్ వెంకటరత్నం, వీసీ నాగరాజ రామారావు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ, ఇస్రోలో చేరడానికి ఎంబీయూ విద్యార్థులు సమర్థులేనని, వారికి అన్ని శక్తి సామర్థ్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తూ, విద్యార్థుల తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తూ దేశంలోనే కీర్తించదగ్గ యూనివర్సిటీగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. వీసీ మాట్లాడుతూ, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడమే మోహన మంత్ర–2023 ముఖ్యోద్దేశమన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలు, కళాశాలలకు చెందిన సుమారు 16వేల మంది విద్యార్థులు ఇందులో పాల్గొంటున్నారని, విద్యార్థులతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ప్రత్యేకత అని, వారిలో నైపుణ్యాలను చాటి చెప్పేందుకు ఇదో వేదిక అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 18 రకాల ఈవెంట్స్ ఉంటాయని, రెండు రోజుల పాటు సాయంత్రం ప్రముఖ గాయకులతో డీజే కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కరోనా సమయంలో మోహనమంత్రను నిర్వహించలేదని, అంతకుముందు తొమ్మిదేళ్లుగా దీనిని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు తమ ప్రతిభను చాటి రాణించాలని ఆకాంక్షించారు.



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

అబ్బురపరిచిన ప్రదర్శనలు

మోహన మంత్ర–2023 లో భాగంగా ప్రదర్శించిన గల్లీ క్రికెట్, షార్ట్ ఫిల్మ్, స్కిట్లు, కళాక్షేత్ర, హర్రర్ హౌస్, ఫ్లాష్ మాబ్, టెక్నో హాలిక్ మొదలైనవి విద్యార్థులను ఆకట్టుకున్నాయి. రాత్రి 7 గంటలకు నిర్వహించిన డీజే కార్యక్రమం వేలాది మంది విద్యార్థులు ఉర్రూతలూగారు.విద్యార్థుల ఆటపాటలతో మంత్రముగ్ధుల్ని చేశారు.



కార్యక్రమంలో శాస్త్రవేత్తలు గోపికృష్ణన్, వెంకటరత్నం, వీసీ నాగరాజ రామారావు



డీజే ఈవెంట్‌లో హోరెత్తిస్తున్న విద్యార్థులు



విద్యార్థుల ఫ్లాష్‌మాబ్

ఆనం మోసకారి



సంక్షేమ పథకాలు వివరిస్తున్న నేదురుమల్లి

వెంకటగిరి రూరల్: జగనన్న కాలనీలో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వకుండా ప్రజలను మోసం చేసిన వ్యక్తి ఆనం రామనారాయణరెడ్డి అని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని 5వ కాలేజీ మిట్టలో ఆ వార్డు కౌన్సిలర్ నారి శేఖర్ ఆధ్వర్యంలో గురువారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమకు గతంలో లాటరీ ద్వారా ఇళ్లప్లాట్ నంబర్లు కేటాయించారుగానీ పట్టాలు ఇవ్వలేదన్నారు. స్పందించిన నేదురుమల్లి వెంకటగిరి ప్రజల ఓట్లతో నెగ్గిన ఆనం వారిని నిట్టనిలువునా ముంచేశారని తెలిపారు. వార్డు కౌన్సిలర్ నారి శేఖర్, పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, విబ్ పూజారి లక్ష్మి, న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు, చిట్టేటి హరికృష్ణ, కౌన్సిలర్లు కళ్యాణి, శ్రీనివాసులు, సుబ్బారావు, నాయకులు గణేష్‌రెడ్డి, మల్లిరెడ్డి, చిన్నా, గిరీష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి కల్పించే దిశగా సీడాప్, డీఆర్‌డీఏ ప్రయత్నాలు చేస్తున్నట్లు పీడీ డీఎంకే తులసి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో బెంగళూరుకు చెందిన నవగురుకుల్ అనే శిక్షణా సంస్థ 50 మంది నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్ కోడింగ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. 17–30 ఏళ్ల వయస్సు కలిగిన వారు పదో తరగతి పాస్ నుంచి డిగ్రీ వరకు చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఏడాది పాటు శిక్షణ ఉంటుందని.. భోజన వసతులు ఉచితంగా ఏర్పాటు చేస్తారని తెలిపారు. నవగురుకుల్ వారు నిర్వహించే స్కీనింగ్ పరీక్షతోపాటు ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి మాత్రమే ఉచిత శిక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం 9160912690 నంబర్‌ను సంప్రదించాలని ఆమె వివరించారు.

రాష్ట్ర కో- ఆర్డినేటర్‌గా డాక్టర్ సుబ్రమణ్యం



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: ఇండో యూరోపియన్ చాంబర్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ సంస్థ ఆంధ్రప్రదేశ్ కో- ఆర్డినేటర్‌గా తిరుపతికి చెందిన ఎస్ఆర్‌కే ఎడుకేషన్ సొసైటీ ఫౌండర్ డాక్టర్ డీ.సుబ్రమణ్యం నియమితులయ్యారు. ఈమేరకు ఆ సంస్థ సీఈఓ డాక్టర్ విజయ్‌తివారి, సెక్రటరీ జనరల్ లక్ష్మీ ఠాగూర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ డీ.సుబ్రమణ్యం మాట్లాడుతూ సంస్థ లక్ష్య సాధనలో తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఉద్యోగప్రాప్తిరస్తు!

- 16 ఏళ్ల నిరీక్షణకు తెర
- వర్సిటీల్లో భారీ ఎత్తున పోస్టుల భర్తీకి సన్నాహాలు
- నేడు నోటిఫికేషన్ విడుదలయ్యే చాన్స్
- గత పాలకుల పాపాలను కడుగుతున్న సీఎం జగన్
- హర్షం వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు



తిరుపతి సిటీ: విద్య, ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారు. ఆయా రంగాల అభివృద్ధికి వినూత్న పథకాలు అమలు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ఖాళీలు భర్తీ చేస్తూ సమోన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా 16 ఏళ్లుగా యూనివర్సిటీల్లో పేరుకుపోయిన ఖాళీ పోస్టులను సైతం భర్తీచేసేందుకు సన్నద్ధమవుతున్నారు. దీనిపై నిరుద్యోగులు సర్వత్రా హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఎస్వీయూలో 422 పోస్టులు

ఎస్వీ యూనివర్సిటీలో ఎంతో కాలంగా భర్తీకి నోచుకోని ప్రొఫెసర్ పోస్టులకు లైన్ క్లియర్ అయినట్టు తెలుస్తోంది. వర్సిటీలో హేతుబద్ధీకరణ అనంతరం 53 ప్రొఫెసర్, 100 అసోసియేట్ ప్రొఫెసర్, 269 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. దీంతో పాటు అకడమిక్ నాన్ వెకేషన్ పోస్టులకు నియామకాలు చేపట్టనున్నారు. ప్రస్తుతం వర్సిటీలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులకు అన్యాయం జరగకుండా 110 జీవోను అమలు చేస్తూ పాలకమండలి గతంలో నిర్ణయం తీసుకోగా, 10 శాతం వెయిటేజీ మార్కులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

మహిళా వర్సిటీలో 187 పోస్టులు

శ్రీపద్మావతీ మహిళా యూనివర్సిటీలో దాదాపు 26 ప్రొఫెసర్, 52 అసోసియేట్ ప్రొఫెసర్, 102 అసిస్టెంట్ ప్రొఫెసర్ల రెగ్యులర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కానుంది. వీటితోపాటు ప్లేస్‌మెంట్, ఫిజికల్ ఎడ్యుకేషన్, లైబ్రేరియన్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్లు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పోస్టులకు సైతం నియామకాలు చేపట్టనున్నారు. ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీలో అత్యవసర నిమిత్తం 33 ఒప్పంద అధ్యాపక పోస్టులకు ఇప్పటికే నోటిఫికేషన్ విడదల చేసింది. సుమారు 140మంది అభ్యర్థులు ఈ నెల 24న జరగనున్న ఇంటర్వ్యూలకు హాజరుకానున్నారు.

నేడు నోటిఫికేషన్ విడుదలకు అవకాశం!

యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి సంబంధించి శుక్రవారం నోటిఫికేషన్ విడదల చేయనున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇప్పటికే ప్రకటించింది. దీంతో ఎస్వీయూ నూతన పాలకమండలి బుధవారం రాత్రి అత్యవసర సమావేశం నిర్వహించి నోటిఫికేషన్‌కు సంబంధించి పోస్టుల వివరాలపై చర్చించి ఆమోద ముద్ర వేసినట్లు తెలిసింది.

మంచి అవకాశం



ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించింది. ప్రతి నిరుద్యోగి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వైఎస్ఆర్ హయాంలోనే వర్సిటీలలో అధ్యాపక నియామకాలు పూర్తి స్థాయిలో జరిగాయి. ప్రస్తుత ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదలకు ప్రయత్నించడం హర్షించదగ్గవిషయం.

-భూమన సుగుణరెడ్డి, మహిళా వర్సిటీ మాజీ రిజిస్ట్రార్, మాజీ ఐఐఐటీ డీన్, ఎస్వీయూ పాలకమండలి సభ్యురాలు

ఎదురు చూస్తున్నాం



యూనివర్సిటీలలో ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి శుక్రవారం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తుందని తెలిసింది. పీహెచ్‌డీ పూర్తిచేసి నోటిఫికేషన్ కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నాం. చాలా సంతోషంగా ఉంది.

-డాక్టర్ ఈ శ్రీదేవి, ఎంసీఏ, పీహెచ్‌డీ, తిరుపతి

నిరుద్యోగులకు ఊరట



మహిళా, ఎస్వీయూలో అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ త్వరలో వస్తుందని తెలిసింది. ఈ వార్త నిరుద్యోగులకు కొంతంత ఊరటనిస్తోంది. సీఎం జగన్‌కు ప్రతి నిరుద్యోగి రుణపడి ఉంటారు.

-డాక్టర్ ఎన్ మహేశ్వరి, ఎంఏ, పీహెచ్‌డీ, తిరుపతి

జీవితాలు బాగుపడతాయి



గత పాలకులు యూనివర్సిటీలను రాజకీయ వేదికలుగా, కుల వ్యవస్థలను ప్రోత్సహించే సంస్థలుగా మార్చారు. వారి స్వలాభం కోసం విద్యార్థులను రెచ్చగొట్టి వదిలేశారు. ఈ నోటిఫికేషన్‌తో ప్రతిభ గల నిరుద్యోగుల జీవితాలు బాగుపడతాయి.

-డాక్టర్ టీ.సురేంద్రనాథ్‌రెడ్డి, సీకాం విద్యాసంస్థల అధినేత, పాలకమండలి సభ్యులు, ఎస్వీయూ

సాక్ష్యాధారాలతోనే బాబుపై కేసులు

- తప్పించుకునేందుకు, సానుభూతికే ప్రభుత్వంపై నిందలు
- క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఆర్కేరోజా

నగరి: చంద్రబాబుపై ఉన్నవన్నీ సాక్ష్యాధారాలతో ఉన్న కేసులే అని పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. గురువారం నగరి పట్టణంలో మీడియాతో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం చంద్రబాబు అరెస్ట్ అయిన కేసులకు సంబంధిత విచారణ 2017లోనే మొదలైందన్నారు. అప్పటి ముఖ్యమంత్రి కూడా ఆయనేనని తెలిపారు. తీగలాగితే డొంకంతా కదిలిందన్నట్లు నాడు ఈడీ లాగిన తీగకు నేడు చంద్రబాబు డొంకంతా కదిలిందన్నారు. ఇందులో ప్రస్తుత ప్రభుత్వం పాత్ర ఏమీ లేదని తెలిపారు. తప్పించుకునేందుకు, జనంలో సానుభూతికే భువనేశ్వరి, లోకేష్, టీడీపీ శ్రేణులు ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారన్నారు. బాబు తప్పు చేయలేదన్న ఆధారాలు, సాక్ష్యాలు ఉంటే అధికారులను, జడ్జిని సంప్రదించాలే తప్ప మీడియా ముందుకు వెళ్లడం దేనికని ప్రశ్నించారు. రూ.కోట్లకు కోట్లు పెట్టి రప్పించుకున్న లాయర్లపై నమ్మకం లేదా అని ప్రశ్నించారు.సాక్ష్యాధారాల కేసుల్లో అన్నిటికీ శిక్షపడితే ఆయన జీవితాంతం జైల్లో ఉండాల్సిందేనని అన్నారు.

పార్టీ భవిష్యత్తుకే గ్యారెంటీ లేదు

భవిష్యత్తు గ్యారెంటీ అంటూ టీడీపీ నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారని మంత్రి రోజా ఆరోపించారు. చంద్రబాబు ఎప్పుడు వస్తారో గ్యారెంటీ లేదని, లోకేష్ జైలుకు వెళ్లడు అనడానికి గ్యారెంటీ లేదని, 175 స్థానాల్లో వంద స్థానాల్లో క్యాండెట్స్‌కు గ్యారెంటీ లేదని, దీంతో ఆ పార్టీ భవిష్యత్తుకే గ్యారెంటీ లేకుండా పోయిందన్నారు. నిజాలు మాట్లాడితే టీడీపీ నాయకులు క్యారెక్టర్ అసాసియేషన్ చేస్తున్నారని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడం, దేశానికి వెన్నెముక అయిన యువకులను విలువలతో పెంచడం, మహిళల్ని గౌరవించడం అందులో భాగమన్నారు. వీటిని విస్మరించి టీడీపీ నాయకులు మహిళల్ని నీచంగా మాట్లాడడం, చిన్న పిల్లలతో నీచ రాజకీయాలు మాట్లాడిస్తూ వారిలో విషం నింపుతూ సంప్రదాయలకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. మహిళ గురించి ఏదో తెలిసినట్లుగా మాట్లాడి పేరుప్రతిష్టలను భ్రష్టుపట్టించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఇలా మాట్లాడే వారిని ఎప్పటికప్పుడు ఖండించాలన్నారు. ఎక్కడ మహిళలన్ని గౌరవిస్తారో అక్కడ దేవతలు కొలువుంటారన్నారు. అందుకే ముఖ్యమంత్రి ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరుతో అమలుచేస్తూ, రాజకీయంగా వారికి విలువనిస్తూ మహిళా సాధికారతకు బాటలు వేస్తున్నారని తెలిపారు.

అవినీతికి పాల్పడితే ఇంటికే



మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: ఉపాధి సిబ్బంది అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని, ఇంటికి పంపించడం ఖాయమని పీడీ శ్రీనివాసప్రసాద్ హెచ్చరించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో 2022 మార్చి 1 నుంచి 2023 ఏప్రిల్ వరకు జరిగిన రూ.8.18 కోట్ల ఉపాధి పనుకు సంబంధించి సామాజిక తనిఖీ చేపట్టినట్టు వెల్లడించారు. ఇందులో మొత్తంగా 1,345 పనులు చేసినట్టు వెల్లడించారు. పనుల్లో జరిగిన అవినీతిని డీఆర్పీలు బహిరంగ సభలో చదివి వినిపించారు. మండలంలోని పలు గ్రామాల్లో కొలతల తేడాలు, కూలీల మస్టర్లో సంతకాలు లేకపోవడంతో ఆయా పంచాయతీల సిబ్బంది నుంచి రూ.45,490 రికవరీకి ఆదేశించినట్లు వెల్లడించారు. జిల్లా విజిలెన్స్ అధికారిణి భాగ్యలక్ష్మి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత, ఎంపీడీఓ గిడ్డయ్య, ఎస్సార్పీ ఆవులయ్య, ఏపీఓ దేవరి, జేఈ బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటీపీలతో తస్మాత్ జాగ్రత్త

చిత్తూరు కలెక్టరేట్ : ఓటీపీలతో అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌వో రాజశేఖర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల సొమ్ము కాజేసేందుకు సైబర్ నేరగాళ్లు ఓటీపీల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పకూడదని తెలిపారు. అమ్మఒడి పథకానికి నిధులు మంజూరు చేస్తామని, ఓటీపీ చెబితే సంక్షేమ పథకాలు మంజూరు అవుతాయని సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్‌లు వస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. వీటిపై జాగ్రత్తగా ఉండాలన్నారు.

మద్యం దొంగల అరెస్ట్



మద్యం షాపులో అక్రమాలకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న ఏఈఎస్ రమేష్

నాయుడుపేట టౌన్: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అక్రమాలకు పాల్పడే ముగ్గురిని ఎస్ఈబీ పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. గూడూరు ఎస్ఈబీ ఏఈఎస్ రమేష్ కథనం.. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని కోనేటిరాజుపాళెం, పాలచ్చూరు గ్రామాలకు వేళ్లే రహదారి కూడలి వద్ద నాయుడుపేట సీఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. పెళ్లకూరు మండలం, కప్పగుంటకండ్రిగ ఎస్టీ కాలనీకి చెందిన సురా రామూర్తి వద్ద నుంచి 44 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిళ్ల మూతపై ఒక పేరు, మరో పేరుతో సిక్కర్ అంటించి ఉండడంతో అనుమానం కలిగింది. దర్యాప్తులో రామూర్తి కోనేటిరాజుపాళెం గ్రామంలోని మద్యం దుకాణంలో మద్యం కొనుగోలు చేసినట్లు తెలుసుకుని అక్కడి మద్యం షాపు సూపర్‌వైజర్ ఓజిలి మండలం, బంగారుగుంట అగ్రహారానికి చెందిన కారణం వెంకట్ సుమంత్, సేల్స్‌మెన్లు ఓజిలి మండలం, ఇనుపగుంట గ్రామానికి చెందిన దండాలు మణి, కుందాం గ్రామానికి చెందిన హరిష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. దర్యాప్తులో కోనేటిరాజుపాళెం గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో రూ.130 విలువ కలిగిన క్వార్టర్ మద్యాన్ని రూ.150 విలువ కలిగిన మరో మద్యం పేరుతో ఉన్న స్టిక్కర్లను అంటించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు తేలింది. ఈ తరహా మోసాలు గత కొద్దిరోజులుగా జరుగుతున్నట్టు గుర్తించారు. ఈ మేరకు సూపర్‌వైజర్‌తోపాటు సేల్స్‌మెన్లను అరెస్ట్‌చేసి కోర్టుకు తరలించగా.. కోర్టు వారికి రిమాండ్ విధించింది. సీఐ ప్రసాద్‌తో పాటు ఎస్ఈబీ పోలీసులు పాల్గొన్నారు.

బీజేపీని ఛీ కొట్టండి

తిరుపతి కల్చరల్: తిరుపతి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్న బీజేపీ నేతలను తిరుపతి ప్రజలు ఛీ కొట్టాలని, రాష్ట్ర గవర్నర్ అభివృద్ధి వైపు స్పందించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. టీటీడీ తిరుపతికి కేటాయించిన ఒక శాతం నిధులపై జిల్లాలో, రాష్ట్రంలో బీజేపీ చేస్తున్న ధర్నాలు, గవర్నర్‌కు అర్జీలు ఇవ్వడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. విశ్వహిందూ పరిషత్, బీజేపీ నేతలు తిరుపతి అభివృద్ధి నిరోధక శక్తులుగా ఉన్నారని, వీరి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.